# తండ్రి గారి సందేశం....



## తపస్సు కాలం - నూతన జీవితానికి నాంది

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

"మానవుడు కేవలం రొట్టెవలననే జీవింపడు. కాని దేవుడు వచించు ప్రతివాక్కు వలన జీవించును" (మత్తయి 4,4). యేసు బప్తిస్మము పొంది నీటి నుండి వెంటనే వెలుపలకు రాగా అప్పుడు ఆకాశము తెరవబడి దేవుని ఆత్మ పావురము రూపమున తనపై దిగివచ్చుటను చూచాడు. అప్పుడు ఆకాశము నుండి ఒక దివ్యవాణి "ఈయన నా ప్రియమైన కుమారుడు. ఈయనను గూర్చి నేను ఆనందించుచున్నాను" అని వినిపించింది (మత్తయి 3,16-17). దేవుని ఆత్మచే అభిషేకమును పొందిన యేసు నలభై రోజులు ఉపవాసము ఉండి ప్రార్థనలో గడిపాడు.

ఈ నలభై రోజుల సిద్ధపాటు యిస్రాయేలు చరిత్రను మనకు గుర్తుచేస్తుంది. మోషే నలభై దినముల పాటు ఉపవాసము ఉండి దేవునికి ప్రజలకు మధ్యలో చేయబడిన ఒడంబడికకు ఆధారమైన పది ఆజ్ఞలను దేవుని నుండి పొందాడు. దేవుడు యిస్రాయేలు ప్రజలను నలభై సంవత్సరాల పాటు ఎడారిలో పరీక్షకు గురిచేసాడు. యిస్రాయేలు ప్రజలు ఆ పరీక్షలో ఓడిపోయారు. దేవుని కుమారుడైన యేసు ప్రభు కూడా ఎడారిలో శోధింపబడ్డాడు. కానీ ఆయన సైతానుపై విజయమును సాదించాడు.

యేసు సైతానుచే శోధింపబడుటకు ఆత్మవలన ఎడారికి కొనిపోబడ్డాడని పరిశుద్ధ గ్రంథం సాక్ష్యమిస్తుంది. (మత్తయి 4,1; మార్కు 1,13; లూకా 4,2) మానవులను దేవుని నుండి దూరం చేయాలనీ దేవుని ప్రణాళికకు వ్యతిరేకంగా మానవులు పాపం చేయాలనీ సైతాను శక్తి నిరంతరం పనిచేస్తూనే ఉంటుంది. సైతాను ఆదితల్లిదండ్రులైన ఆదాము ఏవను శోధించి వారిని ఓడించాడు. ఆ క్షణము నుండి మానవులపై సైతాను అధికారం ఆరంభమయ్యింది. దేవుని చేత ఎన్నుకోబడిన వారు కూడా సైతాను శోధన ముందు నిలబడలేకపోయారు. మానవులను సైతాను బంధకాల నుండి విడిపించడానికే యేసు ప్రభు మానవ రూపం దాల్చాడు. అందుచేతనే, యేసు ఎడారికి నడిపింపబడ్డాడు. సైతానుకు నిలయమైన ఎడారిలో యేసు ప్రభు సైతానును ఓడించటానికే ఆత్మ ఆయనను అక్కడకు నడిపించింది.

యేసు ప్రభు తన జీవితాంతం సైతానుతో అలుపెరుగని పోరాటాన్ని సాగించాడు. "మాకు ఒక గురుతు చూపుము" అని రొట్టె కొరకు మాత్రము వచ్చిన ప్రజలు, సిలువ మరణం వద్దని యేసు ప్రభువుకే హితబోధ చేసే శిష్యులు - ఒక రకంగా ఇవన్నీ కూడా శోధనలే. ఇవన్నీ కూడా దేవుని ప్రణాళిక నుండి యేసు

ప్రభు ప్రక్కకు వైదొలగాలనే ఉద్దేశంతో కూడుకున్న శోధనలే. ఎడారిలో యేసు ప్రభు గురైన శోధనలు అన్ని శోధనలకు పరాకాష్ట వంటివి.

ఈ సంఘటన ఎడారిలో యేసు మరియు సైతాను మధ్యలో జరిగినది. ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షులు ఎవ్వరు లేరు. యేసు ప్రభువే ఈ విషయాన్ని శిష్యులకు చెప్పి ఉండవచ్చు. తండ్రి చిత్తమును నిరంతరం పాటించాలని యేసు ప్రభు ఈ శోధనను ఉద్దేశించి శిష్యులకు బోధించి ఉండవచ్చు.

మనం మన జీవితంలో ఎదుర్కొనే ఏదైన పరిస్థితికి జవాబుగా, స్పందనగా కూడా శోధన మన ముందుకు రావచ్చు. నలభై రోజుల పాటు ఉపవాసమున్న యేసుకు ఆకలవుతుంది. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని "నీవు దేవుని కుమారుడవైనచో ఈ రాళ్ళను రొట్టెలుగా మార్చుము" అని సైతాను శోధించాడు (మత్తయి 4,3). యేసు ప్రభు తన అవసరం కోసం అద్భుతము చేయాలని సైతాను భావించాడు. కానీ అంతకు మించిన అర్థం ఈ మాటల్లో దాగి ఉంది.

యేసు ప్రభు ఆకలి తీర్చుకోవడానికి కష్టపడనవసరం లేకుండా, కేవలం మాటతో రొట్టెను సిద్ధం చేసి ఆకలి తీర్చుకోవచ్చు. కానీ ఆయన ఆ విధంగా చేయలేదు. ఎడారిలో యిస్రాయేలు ప్రజలకు ఆకలైనపుడు దేవుడు వారి కోసం మన్నాను కురిపించాడు. దేవుని కుమారుడైన యేసు ప్రభు ఈ లోకాన్ని రక్షించటానికే వచ్చినట్లయితే అద్భుతం ద్వారా అందరికి ఆహారాన్ని పంచిపెట్టడం అత్యుత్తమమైన విధానం అని మనం భావించవచ్చు. కాని ఇది శోధన. "నిన్ను విశ్వసించుటకు మాకు ఏమి గురుతును ఇచ్చెదవు? ఏమి చేసెదవు అని వారు మరల ప్రశ్నించిరి. 'వారు భుజించుటకు ఆయన పరలోకమునుండి ఆహారము ప్రసాదించెను అని వ్రాయబడినట్లు మా పితరులకు ఎడారిలో మన్నా భోజనము లభించెను' అని వారు ఆయనతో చెప్పిరి" (యోహాను 6,30-31).

సైతాను ఇచ్చిన ఈ సలహా చూడటానికి ఆకర్షణీయంగా, సబబుగా ఉన్నా అది శోధన అని యేసు ప్రభు గ్రహించాడు. యేసు ప్రభు తన బహిరంగ జీవితాన్ని ప్రారంభించక ముందు తన నిర్ణయాన్ని, విధానాన్ని ప్రకటిస్తున్నాడు. ధృడమైన నిశ్చయంతో యేసు ప్రభు "మానవుడు కేవలము రొట్టెవలననే జీవింపడు. కాని దేవుడు వచించు ప్రతి వాక్కు వలన జీవించును" (మత్తయి 4,4). ఈ మాట ద్వారా యేసు ప్రభు మనకు రెండు విషయాలను బోధిస్తున్నాడు.

మెదటిది, దేవుని వాక్యం సజీవమైనది, అది మనకు జీవమునిస్తుంది. కొన్ని వాక్యాలను ధ్యానించడం ద్వారా ఈ విషయం అర్థమవుతుంది. "ఏలయన, క్షయమైన బీజము ద్వారా కాక సజీవమును, శాశ్వతమగు దేవుని వాక్కు అను అక్షయమగు బీజము ద్వారా మీరు నూతన జన్మము నొందితిరి.... దేవుని వాక్కు ఎల్లప్పుడును నిలుచును" (1 పేతురు 1,23-25). "నీ వాక్కులు నా నోటికి తీయగా నున్నవి. తేనె కంటె మధురముగా నున్నవి" (కీర్తన 119,103). "నీవు నీ పలుకులను నాకు విన్పింపగా నేను వానిని భుజించితిని. దేవుడవు సర్వశక్తిమంతుడవునైన ప్రభూ! నేను నీ వాడను కనుక నీ వాక్కులు నాకానందము కలిగించెను. నా హృదయముకు ప్రమోదము చేకూర్చెను"

(యిర్మీయా 15,16). ఆ శతాధిపతి ఆయనతో, "ప్రభూ! నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను. నీవు ఒక్క మాట పలికిన చాలును. నా సేవకుడు స్వస్థతపొందును" (మత్తయి 8:8). శారీరక భోజనం మనకు కేవలం శారీరక బలానిస్తుంది కానీ దేవుని సజీవ వాక్యం మనకు శారీరక జీవమును, స్వస్థతను, నిత్యజీవానిస్తుంది.

రెండవది, యేసు ప్రభు భోజనాన్ని మరియు భోజనానికి ఉన్న ప్రాధాన్యతను తక్కువ చేయట్లేదు కానీ ఈ లోక జీవితంలో భోజనము కన్నా విలువైనవి అనేకం ఉన్నాయి అని ఆయన మనకు నేర్పిస్తున్నాడు. "మొదట ఆయన రాజ్యమును, నీతిని వెదకుడు. అప్పుడవి అన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6,33). మానవుని ఆకలి మరియు దాహం కేవలం భోజనంతో సంతృప్తి చెందేది కాదు. ఈ లోక సిరి సంపదలు ఎన్ని ఉన్నా ఇంకా ఏదో కావాలని మనం తపిస్తుంటాము. మన జీవితం శ్రేష్ఠమైనది. ఈ శ్రేష్ఠమైన జీవితంలో అత్యున్నతమైన దైవరాజ్యమును వెదకటం మన బాధ్యత. భౌతికమైన వస్తువులకు మనం బానిసలం కారాదు. మనం స్వతంత్రముగా జీవించాలి. "మీరు నా మాటపై నిలిచియున్నచో నిజముగా మీరు నా శిష్యులై ఉందురు. మీరు సత్యమును గ్రహించెదరు. సత్యము మిమ్ము స్వతంత్రులను చేయును" (యోహాను 8,31-32).

ఎప్పుడైతే దైవరాజ్యము మనపై ఉంటుందో అప్పుడు మనం క్షమను, ప్రేమను, నిరీక్షణను, కరుణను కలిగి ఉంటాము. ఇదే యేసు ప్రభు మనకు నేర్పించే గొప్ప సత్యం. దేవుని చిత్తానికి మనలను మనం పూర్తిగా సమర్పించుకుంటే మనం మన స్వార్థాన్ని మాత్రం చూసుకోకుండా ఇతరులతో మనకున్నది పంచుకోవటానికి ప్రయత్నిస్తాము. మంచిని పంచే విధంగా, కలిసి జీవించే విధంగా మన జీవితం మారాలని ప్రార్థిద్దాం. సైతాను శోధనలకు లోను కాకుండా దేవుని వాక్య శక్తితో అన్నింటిని జయించి క్రీస్తు అనుచరులుగా జీవిద్దాం. దేవుడు మనలను దీవించును గాక. ఆమెన్.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం
మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు